
సాక్షి ఒడిశా

మంగళవారం | 4 | మార్చి | 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,84,108లు,వెండి 64 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

మాజీ వార్డు మెంబర్ హత్య

పర్లాకిమిడి పరిధిలోని ఓ మాజీ వార్డు మెంబర్‌ను హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

- 8లో.





ఖుర్దా రోడ్ ఘనత

ఖుర్దారోడ్ డివిజన్ ఓ ఘనత సాధించింది. సరుకు లోడింగ్‌లో కొత్త రికార్డు నెలకొల్పింది.

- 8లో.

న్యూస్‌రీల్

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి



జిల్లా కలెక్టరేట్ వద్ద బస్తీ సురక్షా మంచ్ సభ్యులు

పర్లాకిమిడి: ఇళ్లు లేని బస్తీ వాసులకు జాగా మిషన్ ద్వారా భూపట్టాలు అందజేయాలని కోరుతూ బస్తీ సురక్షా మంచ్ సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపింది. అలాగే జిల్లా పాలనాధికారి బిజయ కుమార్ దాస్‌కు గ్రీవెన్సు సెల్‌లో వినతిని అందజేశారు. గత ప్రభుత్వం జాగా మిషన్ ద్వారా కొందరికి ఇళ్ల పట్టాలు అందజేశారని, మరికొందరికి ఇప్పటి వరకూ అందలేదని బస్తీ సురక్షా మంచ్ అధ్యక్షులు సుజిత్ ప్రధాన్ అన్నారు. పర్లాకిమిడి పురపాలక కౌన్సిల్ పరిధిలో ఒకటి, 12వ నంబర్ వార్డుకు చెందిన కంద్రవీధి, రెల్లి పప్పుడి వీధి, దుర్గంపేట వాసులు కలెక్టర్‌తో తమ గోడును విన్నవించారు. ఈ సమస్యపై గత నెల 22న పురపాలక కార్యాలయం ఎదుట నిరసన తెలిపామని కూడా కలెక్టర్‌కు బస్తీ వాసులు తెలియజేశారు. వెంటనే పేద బస్తీ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

కోళ్ల పెంపకంపై డొంగిరియాలకు అవగాహన



డొంగిరియా మహిళలకు కోడి పిల్లలను పంపిణీ చేసిన అధికారులు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదిమ తెగకు చెందిన డొంగిరియా ఆదివాసీ మహిళల ఆర్థిక సాధికారత కోసం జిల్లా పశువైద్య శాఖ నడుం బిగించింది. ఈ మేరకు సోమవారం నియమగిరి పర్వత ప్రాంతాల్లోని పర్శాలి, సునాఖండి పంచాయతీల్లో గల తొలొముసిడి, ఉపారొ ముసుడి, కద్రక బెండిలి, టిబాగుడ, పంచుకుండి, మారిఝ బొండిలి, రాయిలిమ్మ, సనొఘుడాఘుడి తదితర గ్రామాలకు చెందిన 258 మంది డొంగిరియా మహిళలకు 10,390 కోళ్ల పిల్లలను పంపిణీ చేశారు. డొంగిరియా కొంధొ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (డీకేడీఏ) సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సరోజ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై డొంగిరియా మహిళలకు కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కోళ్ల పెంపకంలో మెలకువలు అవసరమైన సూచనలు తమ శాఖ అందిస్తుందని పశుచికిత్స శాఖ డాక్టర్ బిచిత్ర నంద సాహు అన్నారు.

లిమాగుడలో మా బ్రాహ్మణీ మందిర ప్రతిష్ట



మందిరం వద్ద భక్తులు

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి పరిధి లిమాగుడ గ్రామంలో నిర్మించిన మా బ్రాహ్మణీ మందిర ప్రతిష్ఠోత్సవం ఘనంగా జరిగింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆదివాసీ ప్రాంతాలైన పరిసర గ్రామ ప్రజలు సంప్రదాయ వాయిద్యాలతో ఉత్సవాల్లో పాల్గొన్నారు. కలశ యాత్రను నిర్వహించారు. పురోహితులు దుర్గాప్రసాద్ నందో, దేవరాజ్ బెహరల పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

21 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ రైల్వే స్టేషన్ వద్ద ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో తమిళనాడుకు చెందిన టి.సతీష్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ హమీద్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. జిల్లాలోని చంద్రపూర్ నుంచ ఛత్తీస్‌గఢ్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులను నిర్వహించారు. ఇందులో భాగంగా బిసంకటక్ రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన హమీద్, సతీష్‌ల బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.

జడలు విప్పిన మూఢ నమ్మకం

- నవజాత శిశువు పొట్టపై 40 చురకలు



ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత మగ శిశువు



ముఖ్య వైద్యాధికారి సంతోష్ కుమార్ పండా



కాధంబని త్రిపాఠి

కొరాపుట్:

మనిషి అధునాతన టెక్నాలజీతో వేరే గ్రహాల మీదకు వెళ్లిపోతున్నాడు. సాంకేతికంగా అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాడు. ఇలాంటి కాలంలోనూ ఇంకా ఒడిశాలో మూఢ నమ్మకాల జాడలు కనిపిస్తున్నాయి. గిరిజనుల మూఢ నమ్మకం ఓ నవజాత శిశువు ప్రాణం మీదకు తెచ్చింది. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ ప్రభుత్వ ఆస్పత్రికి గిరిజనులు ఒక నవజాత మగ శిశువుని తీసుకుని వచ్చారు. అనారోగ్యంతో ఉన్న ఆ శిశువును వైద్యులు పరిశీలించగా పొట్ట మీద కొడవలితో 40 చురకలు వేసిన గుర్తులు ఉన్నాయి. ఈ గుర్తులు చూసిన వెంటనే డాక్టర్లు అదిరి పడ్డారు. వెంటనే జిల్లా కేంద్రాస్పత్రి ముఖ్య అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం ఇంత లోనే దావానలంగా వ్యాపించడంతో ప్రముఖ టీవీ చానెళ్లలో ప్రముఖ వార్తగా వైరల్ అయిపోయింది. వెంటనే రాష్ట్ర వైద్య శాఖ రంగంలో దిగి శిశువుని రక్షించడానికి చర్యలు చేపట్టింది. జిల్లాలో చందాహండి సమితి గంబారి గుడ గ్రామ పంచాయతీ పండేల్ పాడ గ్రామానికి చెందిన సరోజ్ కుమార్ నాయక్ అనే గిరిజనుడికి మగ శిశువు జన్మించాడు. కుమారుడి ఆరోగ్యం బాగుండాలని కోరుతూ గ్రామ సమీపంలో మంత్రగత్తెను అతడు ఆశ్రయించాడు. ఆమె శిశువు పొట్ట మీద కొడవలిని కాల్చి వాతలు పెడితే ఆరోగ్యంగా ఉంటాడని చెప్పి అలాగే చేసింది. కానీ ఆ వాతలు చీము పట్టి ఆ బిడ్డ నరకయాతన అనుభవించాడు. చివరకు విధి లేక ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా విషయం వెలుగులోకి వచ్చింది. నబరంగ్‌పూర్ జిల్లా ముఖ్య వైద్యాధికారి సంతోష్ కుమార్ పండా మాట్లాడుతూ ప్రస్తుతం తాము నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. గ్రామీణ స్థాయిలో గిరిజనులకు మూఢ నమ్మకాలను వదిలించడానికి మరింతగా అవగాహన కార్యక్రమాలు నిర్వర్తించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మరో వైపు ఈ విషయం పై మహిళా హక్కుల ఉద్యమ కర్త కాధంభని త్రిపాఠి మండిపడ్డారు. ఈ మూఢాచారం నిర్మూలన కోసం తాము చందాహండి,జొరిగాం సమితులలో అవగాహన ర్యాలీలు నిర్వహించామన్నారు. ఇలా వాతలు పెట్టిన మంత్రగత్తెలను అరెస్ట్ చేస్తే గాని సమస్య అదుపులోనికి రాదని కాధంబని పేర్కొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

జయపురం: జయపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇదివరకు బంగారు నగలు, డబ్బు, మహిళల మెడలో బంగారు గొలుసులు, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగిలించేవారు. కానీ ఇప్పుడు ఇళ్ల మీద పడి దొరికిన వస్తువులను దోచుకెళ్లిపోతున్నారు. ఆఖరికి ఇళ్లలో పాడయిన సిల్వర్ వంట సామాన్లు, వాటర్ పైపు టేప్‌లు, వైర్లు కూడా చోరీ చేస్తున్నారు. ఆదివారం పట్టణ పోలీసులు వెల్లడించిన ఐదు దొంగతనాల కేసుల్లో ఏడుగురు దొంగలు, ఇద్దరు కబడ్డీ దుకాణదారులు అరెస్టయ్యారు. పట్టణ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వివరణ ప్రకారం.. మూడు కేసుల్లో అరెస్టు అయిన వారిలో ముగ్గురు 28 ఏళ్లలోపు వారు కాగా ఒకడు 33 ఏళ్ల వాడు. అరెస్టయిన వారు ఒడియమేదరి వీధికి చెందిన బిశాల నాగ్(20), రాజీబ్ శబర(18), బాపూజీ నగర్ అశోక్ హంతాల్(22), గోపబంధు నగర్ రవీంద్ర భాగ్(33) లు అని వెల్లడించారు. రాజీవ్‌పై 9 దొంగతనం కేసులు ఉన్నాయని, అలాగనే బిశాల్ నాగ్‌పై 3 కేసులు, బిశాల్ పేరున 3 కేసులు, రవీంద్ర పేరున 12 కేసులు, అశోక్ పేరున 4 దొంగతనం కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వారి నుంచి సామాన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 25న స్థానిక సునారీ వీధిలో కాంచప గంతాయిత్ స్కూల్‌కు వెళ్తున్న సమయంలో బిశాల్,రాజీవ్‌లు నకిలీ నంబర్ ప్లేట్ బైక్ పై వచ్చి కాంచన మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్ ను తెంపుకు పోయారని పోలీసు అధికారి వెల్లడించారు. పట్టణంలో గల 50 సీసీ కెమెరాలను పరిశీలించి వీరిని పట్టుకున్నామన్నారు. అలాగే ఫిబ్రవరి 21 వ తేదీన బ్లడ్‌బ్యాంక్ అధికారి డాక్టర్ సూర్య శేఖర మిశ్ర బ్లడ్ బ్యాంక్‌లో దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారని, గత 4 నుంచి 20 తేదీల మధ్య దుండగులు పాత బ్లడ్‌బ్యాంకు తాళాలు విరిచి 5 స్ప్లిట్ ఏసీలు, ఒక ఇన్వర్టర్, రెండు బ్యాటరీలతో పాటు వాటర్ పైప్ ఫిటింగ్స్ దొంగిలించారని తెలిసిందన్నారు. వీరు సినిమా హాల్- మార్కెట్ ప్రధాన మార్గంలో పార్కింగ్ చేసిన ఒక ట్రక్కు నుంచి రెండు ఎల్‌ఈడీ 32 అంగుళాల టీవీలు కూడా దొంగిలించారని తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నిరాశ్రయులు, దివ్యాంగులకు 4 సెంట్ల స్థలం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులు తదితరులు

జయపురం: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కొరాపుట్ డివిజన్ సునాబెడ వారు మొదటి సారిగా జయపురంలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు సమకూర్చేందుకు సహకరించారని, ఇది స్వాగతించ దగ్గదని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జిల్లా అధికార యంత్రాంగం సహకారాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం స్థానిక సహిద్ లక్ష్మణ నాయిక్ స్మృతి భవనంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అవినీతిని అంతం చేయాలన్నారు. జయపురం సబ్ కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌశ్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత, మున్సిపాలిటీ సహాయ కార్యనిర్వాహక అధికారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులతో పాటు కొత్తగా పెళ్లి చేసుకున్న వారికి ఆర్థిక సాయంగా రూ.2.5 లక్షలు చొప్పున అందజేశారు. కొందరు నిరుపేద విద్యార్థులకు రూ.50వేలు చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన రథానికి పచ్చ జెండా ఊపారు. ఆవాస్ యోజన పథకంలో ఇల్లు నిర్మించుకునేందుకు ఏడాదిలో రూ.3లక్షలు కంటే తక్కువ ఆదాయం ఉన్న వారికి రూ.2 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తారని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నిరాశ్రయులకు, దివ్యాంగులకు పట్టణ పరిసరాల్లో 4 సెంట్ల చొప్పున స్థలం కేటాయిస్తామని, కేటాయించే స్థలం పట్టణానికి 10 కిలోమీటర్ల దూరం అయినా లబ్ధిదారులు అంగీకరించాలని హర్షధ్వానాల ప్రకటించారు. కార్యక్రమంలో 165 మంది వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, శబ్ద గ్రహణ యంత్రాలు, వీల్‌చైర్లు, హ్యాండ్ స్టిక్స్ తదితర పరికరాలను అందజేశారు.

జనమేష్.. నీ కీర్తి అమరం



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



జనమేష్ లెంకా

భువనేశ్వర్: అవయవ దానంతో చిన్నారి జనమేష్ లెంకా చిరంజీవిగా మారాడు. తన మూత్ర పిండాలు, కాలేయం దానం చేసి అతి పిన్న వయసు అవయవ దాతగా నిలిచాడు. ఏడాదిన్నర వయసున్న చిన్నారి జనమేష్ మెదడు సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆ కుటుంబం కిడ్నీ, కాలేయం దానం చేసింది. స్వస్థలం రౌర్కెలా అయినా.. చిన్నారి తండ్రి స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో పని స్థానిక కళింగ విహార్ ప్రాంతంలో ఉంటున్నారు. జనమేష్ దానం చేసిన కాలేయాన్ని ఢిల్లీలోని ఒక బిడ్డకు మార్పిడి చేయగా, అతని కిడ్నీని భువనేశ్వర్‌లోని ఒక బిడ్డకు ఇచ్చారు. చిన్నారి మృతితో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. అంత విషాదంలోనూ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను స్థానికులు అభినందించారు. అవయవ దాత జనమేష్ లెంకా అంత్యక్రియల్ని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు.

సత్యసాయి సమితి ఔదార్యం

- నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మాణం



రోజా కుటుంబం



సాయి భక్తులు నిర్మించిన ఇల్లు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సమితి పరిధి కొత్తురు గ్రామంలో నిరుపేద కుటుంబమైన కొపులి రోజాకు సత్యసాయి సమితి ఇల్లు నిర్మించి తన సేవా భావాన్ని చాటుకుంది. గత శాసనసభ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన బీజేడీ నాయకుడు ఏకే పాండ్యన్ రోజా కుటుంబ కష్టాలను విని 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. తమిళనాడుకు చెందిన రోజా వివాహం అనంతరం కొత్తూరులో స్థిరపడ్డారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. అయితే గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త మరణించడంతో కష్టంగా కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. పాడుపడిన ఇంటిలో నివాసం ఉంటుంది. ఉండడానికి సరైన ఇల్లు లేక నానా ఇబ్బందులు పడుతున్న వీరి కష్టాలను చూసిన గుణుపూర్‌లోని సత్యసాయి సేవా సమితికి చెందిన సభ్యులు నిధులను సమకూర్చి ఇంటిని నిర్మించి రోజాకు ఇచ్చి ఆదర్శంగా నిలిచారు.

• ఆత్మీయ కలయిక



రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న సహీద్ లక్ష్మణ్ నాయక్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 2005లో చదువుకు మెట్రిక్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఏర్పాటు చేసుకున్నారు. బెంగళూరు, పూనే, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగ్య, వృత్తి రీత్యా స్థిరపడిన వారంతా ఇందులో పాల్గొన్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. ఈ సందర్భంగా చదవు చెప్పిన పూర్వ గురువులను సత్కరించి గౌరవించారు. పూర్వ విద్యార్థులు ఎ.శ్రీనివాస్, కృష్ణ చంద్ర అధికారి, శాశ్వత మహాపాత్రో పాల్గొన్నారు.

డిమిరిగుడలో నీటి ఎద్దడి



పాడైన గొట్టపుబావి

- ఆందోళనలో ప్రజలు
- పరిష్కరించాలని వేడుకోలు



నెమ్మదిగా వస్తున్న బోరునీరు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి డిమిరిగుడ గ్రామంలో మంచినీటి ఎద్దడి తలెత్తింది. వేసవి ప్రారంభంలోనే నీటి సమస్య ఏర్పడడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముమ్ముందు సమస్య మరింత తీవ్రతరం దాల్చే అవకాశం ఉందంటున్నారు. సమస్య మరింత తీవ్రరూపం దాల్చకముందే సమస్యను పరిష్కరించాలని.. లేదనే ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు. గత రెండేళ్ల క్రితం బీజేపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామంలో ప్రజలకు శుద్ధమైన నీటిని సరఫరా చేసేందుకు ప్రారంభించిన వసుధ పథకంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటి ముందు కుళాయిలను ఏర్పాటు చేశారు. అయితే రెండేళ్లు గడిచినప్పటికీ కుళాయిల నుంచి చుక్కమంచినీరైనా రాలేదని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలో సుమారు 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రెండు గొట్టపుబావుల్లో ఒకటి ఇప్పటికే మరమ్మతులకు గురవ్వగా ఉన్న ఒక్కగొట్టపుబావి పైనే గ్రామస్తులు ఆధార పడుతున్నారు. సుమారు 150 మందికి పైబడి ఉన్న జనాభాకు కేవలం ఒకే గొట్టపు బావి ఉండటం.. అదీ గంటల తరబడితే గాని బిందెడు నీరు నిండకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించండి మహాప్రభో అని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేదని గ్రామస్తులు అంటున్నారు. వేసవి ప్రభావం ఎక్కువ కాకముందే సమస్యను పరిష్కరించాలని.. లేకుండా ఆందోళన చేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.

భావితరాలకు సాహిత్యం ఓ వారధి



సాహిత్య సంసద్‌లో పాల్గొన్న ఉదయనాథ జాని తదితర అతిథులు



కవిత చదువుతున్న రచయిత

జయపురం: భాష, సంస్కృతి, చరిత్రలను భావి తరాల వారికి అందించేదే సాహిత్యం అని నవరంగపూర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజుక్త పండా అన్నారు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో స్థానిక సాహిత్య సంస్థ పూజ్య పూజ సాహిత్య సంసద్ 27 వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజాన్ని చైతన్య పరిచేందుకు వినియోగ పడే సాహిత్యాన్ని రచయితలు పాఠకులకు అందించాలని పిలుపునిచ్చారు. పూజ్య పూజా సాహిత్య సంసద్ గత 27 ఏళ్లుగా సాహిత్య రంగానికి అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అభ్యుదయ సాహిత్యంపై ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించాలన్నారు. పూజ్య పూజ సాహిత్య సంసద్ అధ్యక్షుడు, రేడియో విశ్రాంత అధికారి ఉదయ కుమార్ జాని అధ్యక్షతన జరిగిన సాహితీ కార్యక్రమంలో ముఖ్యవక్తగా కొరాపుట్ ప్రభుత్వ కళాశాల ఒడియా విభాగ అధ్యాపకుడు డాక్టర్ లోపముద్ర స్వైం ఒడిశాలో భాష, సాహిత్యాలపై ప్రసంగించారు. గౌరవ అతిథిగా జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (డైట్) ప్రిన్సిపాల్ రూప చంద్ర సొరెన్, సాహితీ సంసద్ కార్యదర్శి భైరాగీ చరణ సాహు, సహాయ కార్యదర్శి మృత్యుంజయ సాహు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఒడియా సాహిత్యానికి సేవలందిస్తున్న ఆకాశ వాణి జయపురం కేంద్రం ప్రముఖ గాయకులు రంజన్ కుమార్ బెహర, పతంజలి రాష్ట్ర ప్రభారీ జానకీ పాణిగ్రాహిలు సాహిత్యానికి తమ జీవితాన్ని అంకితం చేస్తున్నందుకు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. సాహితీ సమావేశం రెండో అంకంలో స్వీయ కవితా పఠనం కార్యక్రమానికి పూజ్య పూజ సాహితీ సంసద్ ఉపాధ్యక్షుడు తపన్ కిరణ్ త్రిపాఠీ అధ్యక్షత వహించారు. జిల్లా డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జుగళ కిశోర్ మిశ్రా గౌరవ అతిథిగా పాల్గొన్న కవితా పఠనం కార్యక్రమంలో ఇంజనీర్ కేధానాథ్ బెహర, ఇంజినీర్ భాస్కర సామంతరాయ్, డాక్టర్ ప్రదీప్ కుమార్ మిశ్ర, అశోక్ మహరాణ, చంద్రకాంత బిశ్వాల్, రఘునాథ్ బిశ్వాల్, స్మృతి పండ, అభినాశ్ శాంత పాత్రో, కృష్ణ కుమారి నందో, అభినాశ్ సామంతరాయ్, డాక్టర్ సురేష్ చంద్ర దాస్, డాక్టర్ ప్రమోదిని, మనోజ్ పండ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అపహాస్యం.. ఆగ్రహం

భువనేశ్వర్: ఒక విదేశీ మహిళ తన తొడపై శ్రీ జగన్నాథుడి బొమ్మను పచ్చ బొట్టుగా పొడిపించుకోవడం తీవ్ర కలకలం రేపింది. రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఇది అపవిత్రమైన చర్య అని పేర్కొంటూ హిందూ సేన స్థానిక సాహిద్ నగర్ ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సంఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘట్టం సాంఘిక మాధ్యమంలో విస్తృతంగా ప్రసారం కావడంతో మరింత అలజడి రేగింది. నగరంలో ఒక టాటూ పార్లర్‌లో విదేశీ మహిళ తన తొడపై పొడిపించుకున్న జగన్నాథుడి పచ్చ బొట్టును బహిరంగంగా ప్రదర్శించడం సాంఘిక మాధ్యమంలో ప్రసారమైంది. స్వామి భక్త జనం ఈ సంఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో వివాదానికి దారితీసింది. ఆ మహిళ తొడపై అత్యంత గౌరవనీయమైన దేవత యొక్క పచ్చ బొట్టు స్థానిక మత విశ్వాసాలను అగౌరవ పరిచేదిగా పరిగణించి చర్యలు చేపట్టాలని భక్త జనం పట్టుబడుతున్నారు.

గ్రామంలోకి చొరబడిన జింక



పట్టుబడిన జింక

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి అటవీ రేంజ్ పరిధిలో గల బంకాంబ పంచాయతీకి చెందిన ఉపారొకొడింగా గ్రామంలోకి జింక చొరబడింది. దీనిని గ్రామస్తులు పట్టుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. జింక గర్భంతో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే చికిత్స చేయించి ఆరోగ్యంగా ఉండటంతో సామవారం అడవులోకి విడిచిపెట్టారు.

మాజీ వార్డు మెంబర్ దారుణ హత్య



హత్యకు గురైన నువాబడి గ్రామస్తుడు ముళా మఝి

పర్లాకిమిడి: పాతకక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు దారి కాసి మాజీ వార్డు మెంబర్ ముళా మఝి (40)ని కొరడాగడి గ్రామం వద్ద హత్య చేసి మోటారుబైక్‌కు కట్టి ఈడ్చుకువెళ్లి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటామా రోడ్డు పక్కన పడేశారు. అడవ పంచాయితీ కటమా వద్ద సోమవారం సంచనలంగా మారింది. ఈ సంఘటన అనంతరం మృతుని బంధువులు, నువాబడి గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి హత్య చేసిన అగంతకులను పోలీసులు వెంటనే అరెస్టు చేయలని డిమాండు చేశారు. వివరాలు ఇలా వున్నాయి. జిల్లాలో మోహనా నియోజకవర్గం అడవ పంచాయతీ కటమా గ్రామం నువాబడి వద్ద మాజీ వార్డు సభ్యుడు ముళా మఝి పానిగండ నుంచి ఆదివారం తిరిగి వస్తుండగా కొందరు ప్రత్యర్థులు దారి కాసి కొట్టి బైక్ వెనక్కి కట్టి ఈడ్చుకుని వెళ్లి కటమా రోడ్డు పక్కన పడేశారు. సోమవారం ఉదయం మృతుని సోదరుడు సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకుని భోరున విలపించాడు. పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. హత్య కేసులో ముళా మఝి సాక్షిగా ఉన్నాడు. ఆ నేపథ్యంలోనే హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ కేసును అడవ పోలీసు ఐఐసీ సుభ్రాంత పండా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంతవరకూ నిందితులు ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదు.

ఉత్సాహం ఉత్సవమై..

● వైభవంగా బోడ జాతర ప్రారంభం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో రెండేళ్లకు ఒకసారి జరిగే బోడజాతర సోమవారం ఆరంభమైంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పోల్లేరు నదీ నుంచి జాతరను ప్రారంభించారు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తొలుత పోల్లేరు నదిలోని నీటిలో దేవతా మూర్తుల విగ్రహాలకు స్నానం చేయించిన అనంతరం జాతరను ప్రారంభించారు. పార్లమెంటు సభ్యుడు బోలోభద్ర మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి హాజరై నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి అమ్మవారికి పూజలు చేశారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీసగఢ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన అధికసంఖ్యలో భక్తులు పవిత్ర స్నాన జాతరలో పాల్గొన్నారు .అనంతరం అమ్మవారిని నౌక విహారంతో నది దాటించి మల్కన్‌గిరి జిల్లా మాన్యంకొండ గ్రామం వద్దకు చేర్చారు. మంగళవారం రాత్రి, మంగళవారం సాయంత్రం వరకూ అక్కడే అమ్మవారిని ఉంచుతారు. మంగళవారం రాత్రి నుంచి ప్రయణం సాగించి ఏడుచోట్లు జాతర చేసుకొని మల్కన్‌గిరికు చేరుకుంటారు. అమ్మవార్లు మా ముత్యాలమ్మ , కన్నంరాజ్(శ్రీకృష్ణుడు), బాల్‌రాజ్(అర్జునుడు), పోతురాజ్ (భీముడు)లు సామేతంగా బయలుదేరారు. భక్తులకు ఇబ్బందిలేకుండా అన్నదాన, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా సబ్ కలెక్టర్ అందుబాటులో ఉంటూ పర్యవేక్షించారు



పుణ్యస్నానాలు చేసిన ఎంపీ బోలోభద్ర మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి తదితరులు



స్నాన జాతరలో పూజలందుకుంటున్న దేవతా మూర్తులు



స్నానాలు చేస్తున్న భక్తజనం



నృత్యం చేస్తున్న మహిళలు



నది వద్ద వాట్రాఫ్ బృందం



అమ్మవారి దర్శనానికి వేచిఉన్న భక్తులు



ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



ఒడిశా నుంచి ఆంధ్రాకు నదిని దాటేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన



నౌకలో అమ్మవారిని నదిని దాటిస్తున్న దృశ్యం

విస్తృత ప్రచారం కల్పించాలి



కొరాపుట్ విషయ సూచికను ప్రారంభిస్తున్న అరవింద పాడీ, తదితరులు

జయపురం: విశ్వ వ్యవసాయ చారిత్రిక స్థలంగా గుర్తింపు పొందిన కొరాపుట్‌పై విస్తృత ప్రచారం చేసేందుకు అధికారులు సమాయత్తమం కావాలని రాష్ట్ర వ్యవసాయ విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద పాడీ అన్నారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు కొరాపుట్ సంస్కృతి, వ్యవసాయ ప్రణాళిక, వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తికి, బ్రాండిగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఎర్పాటు చేసిన విషయ సూచన ఫలకాలను జిల్లాలో 8 చోట్ల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జయపురం విమానాశ్రయంలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద పాడీ విశ్వ వ్యవసాయక చారిత్రిక స్థలంగా గుర్తింపు ఫలకాన్ని ప్రారంభించారు. విశ్వంలోనే ప్రథమ వ్యవసాయ స్థలం కొరాపుట్‌కు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జయపురం దసరా పొడియ మైదానంలో నిర్వహిస్తున్న వ్యవసాయ యంత్ర మేళా సందర్భంగా జయపురం వచ్చిన డాక్టర్ పాడీ వివిధ ప్రభుత్వ అధికారులతో ప్రపంచంలో వ్యవసాయం పుట్టినిల్లు చారిత్రిక స్థలం అయిన కొరాపుట్ జిల్లాపై సుదీర్ఘంగా చర్చించారు. నేటివరకు ఈ విషయం ప్రచారం కాకపోవటం విచారకరమన్నారు. కొరాపుట్ పర్వత ప్రాంతం, వ్యవసాయ క్షేత్రం, సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తున పంటలు పండుతున్న ప్రాంతంలో ఆదివాసీ సంస్కృతి, జన సంఖ్య, అటవీ ఉత్పత్తులు, దేశీ విత్తనాల సంరక్షణ, జైవిక పద్ధతిలో పంటల పండించటం,సేఫ్టీ కల్టివేషన్, ప్రకృతి జల వినియోగం, తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. జిల్లాలో పండుతున్న ధాన్యం, కొలాజీర ధాన్యం (నల్ల ధాన్యం), రాగులు, ఊదలు, గంటెలు, జొన్నలు, ఒలిసి, మొక్కజొన్న, కాయగూరలు, బంగాళదుంపలు, కాఫీ, మిరియాలు, పప్పు ధాన్యాలు, తదితర పంటలపై పర్యాటకుల్లో అవగాహన కల్పించేందుకు ప్రచారం చేయాలన్నారు. జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శౌశ్యరెడ్డి, విమానాశ్రయ డైరెక్టర్ కమేండర్ అబకిశ పారిడ, జిల్లా వ్యవసాయ అధికారి గోకుల చంద్ర ప్రదాన్, ఉద్యాన వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ సుధమ చరణ బిశ్వాల్, వ్యవసాయ విభాగ అదనపు డైరెక్టర్ కన్హుచరణ దాస్, కుంద్ర బ్లాక్ వ్యవసాయ అధికారి తాపస చంద్రదాస్, ఎం.ఎస్.స్వామినాథన్ రిసేర్చ్ ఫౌండేషన్ సైంటిస్ట్ డాక్టర్ కార్తీయ లుంక పాల్గున్నారు.

ఖుర్దా రోడ్ డివిజన్ ఘనత



పారాదీప్ ప్రాంతంలో సరుకు లోడింగు.

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం సరుకు రవాణాలో తనదైన సత్తాని చాటుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రోజుకు సగటున 130.5 ర్యాకుల సరుకు లోడ్ చేసి సరికొత్త రికార్డు నెలకొలిపింది. గత ఏడాది మార్చి నెలలో అత్యధికంగా దినసరి సరుకు లోడు 128.1 ర్యాకులకు పరిమితం కాగా ఈ ఏడాది 130.5 ర్యాకుల లోడుతో పాత రికార్డును బద్దలు కొట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో 1 నుండి 28వ తేదీ వరకు మండల వ్యాప్తంగా వివిధ లోడింగ్ పాయింట్‌ల నుంచి సమగ్రంగా 3 వేల 655 ర్యాక్‌ల్లో సరుకు లోడు చేయడం విశేషంగా పేర్కొన్నారు. పారాదీప్ ప్రాంతంలో అత్యధిక దినసరి సరుకు లోడింగు నమోదైంది. ఈ ప్రాంతం దినసరి సరుకు లోడింగు 29.1 ర్యాకులుగా నిలిచింది. ఉక్కు కర్మాగారాలకు బొగ్గు, ఇనుప ఖనిజం వంటి ముడి పదార్థాలు, ఎరువులు, సిమెంట్, ఆహార ధాన్యాలు మొదలైనవి నిత్యం రవాణా చేస్తారు. ఈ సందర్భంగా స్థానిక మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా అనుబంధ అధికార, సిబ్బంది యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

వినతుల వెల్లువ



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం గ్రామ ముఖిపరిపాలన, గ్రీవెన్స్ సెల్‌కు అధిక స్పందన లభించింది. ఈ గ్రీవెన్స్‌కు జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ అదనపు కార్యనిర్వాహణ అధికారి పృథ్వీరాజ్ మండల్ తదితరులు హాజరయ్యారు. 80 వినతులు అందగా వాటిలో వివిధ గ్రామస్యలు 63, వ్యక్తిగతం 17 ఉన్నాయి. వాటిలో 5 వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఒక నిస్సహాయురాలికి రూ.5వేలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కలెక్టర్ ఆర్థిక సహాయం అందజేశారు. కెరండి, కత్తల కవిటి, రాణిపేట, పర్లాకిమిడి పురపాలక సంఘం నుంచి వినతులు అందాయి. ఈ స్పందన కార్యక్రమానికి ప్రాజెక్టు అధికారి (ఐ.టి.డి.ఏ.) అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనూప్ పండా, తదితరులు హాజరయ్యారు.

61 వినతుల స్వీకరణ..

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి 61 వినతులను అధికారులు స్వీకరించారు. 49 వ్యక్తి గత సమస్యలు, 12 గ్రామ సమస్యలుగా గుర్తించారు. స్వీకరించిన వినతులను పరిశీలించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, జిల్లా ముఖ్యవైద్యాధికారి లాల్ మోహన్ రౌత్రాయ్, తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: హాజరైన ప్రభుత్వ అధికారులు



పర్లాకిమిడి: సీఎం సహాయ నిధి అందజేస్తున్న కలెక్టర్



రాయగడ: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజలకు మౌలిక సదుపాయాలు అందటం లేదు



సమావేశం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, ఎమ్మెల్యేలు దాశరథి గోమాంగో, రూపేష్ పాణిగ్రాహి తదితరులు

● బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

● 'దిషా'సమీక్ష సమావేశం



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని పలు సమితిలు, పంచాయతీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలైన విద్య, ప్రాథమిక వైద్యం, మంచినీరు, రవాణా, ఇన్‌ఫ్రాస్టక్చర్ అందటం లేదని 'దిషా'సమీక్ష సమావేశంలో అర్థమైందని బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్సు హాలులో సోమవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం (దిషా) జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి పాల్గొన్నారు. జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలు దాశరథి గోమాంగో (మోహానా), పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహితో పాటు జిల్లా పరిషత్తు అధ్యక్షులు గవర తిరుపతిరావు, గుమ్మా, కాశీనగర్, గుసాని, నువాగడ, ఆర్.ఉదయగిరి సమితి చైర్మన్‌లు, పురపాలక సంఘం అధ్యక్షురాలు నిర్మలా శెఠి పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్ అధ్యక్షత వహించారు. గజపతి జిల్లా మహాత్మాగాంధీ ఉపాధి పథకం గుసాని సమితిలో కేవలం రూ.455.32 లక్షలు నిధులు మాత్రమే ఖర్చయ్యాయని కలెక్టర్ దాస్ అన్నారు. అలాగే గ్రామీణ ఇళ్ల పథకం, రేషన్ కార్డులు, స్వచ్ఛభారత్ మిషన్, జలజీవన్ మిషన్ పథకాలు పూర్తిగా అమలు జరగటంలేదని జిల్లా పరిషత్తు అధ్యక్షులు గవర తిరుపతి రావు ఆరోపించారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గంగాబడ పంచాయతీ మాణిక్ పట్నాలో బోర్లు ఆంధ్రా ప్రభుత్వం తవ్వారని.. కానీ ఒడిశా వాసులకు చుక్క నీరు ఇవ్వడం లేదని రాయఘడ సమితి చైర్మన్ పూర్ణబాసి నాయక్ కలెక్టర్‌కు నివేదించారు. జిల్లాలో వైద్యుల కొరత ఎక్కువుగా వుందని మోహానా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ఎంపీతో అన్నారు. మోహనా, అడవకు అంబులెన్సులను ఎంపీ నిధులతో మాంజూరు చేస్తానని పార్లమెంటు సభ్యుడు ప్రదీప్ పాణిగ్రాహి హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు వేగవంతం చేయలని ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి అధికారులను కోరారు. అనంతరం ఎంపీ పాణిగ్రాహిని ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, రూపేష్ పాణిగ్రాహి పుష్పచ్ఛాలతో అభినందించారు. డీఆర్‌డీఏ ఆదనపు ఈవో పృథ్వీరాజ్ మండళ్, ఆర్ అండ్ బీ సీఈఎంవో గ్రామీణ త్రాగునీరు శానిటేషన్, జిల్లా ముఖ్యవిద్యాధికారి మాయాధర్ సాహు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ

మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావుకు మాతృవియోగం

పర్లాకిమిడి: మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకులు కోడూరు నారాయణ రావు తల్లి కోడూరు రమణమ్మ(90) ఆదివారం స్వగ్రామం కాశీనగర్ సమితి ఇస్తల గ్రామంలో మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతికి సంతాపంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతి జెన్నా ఆదివారం ఇస్తల గ్రామం వెళ్లి కోడూరు నారాయణ రావును పరామర్శించారు. అలాగే బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి కూడా సోమవారం సాయంత్రం ఆయనను పరామర్శించారు.



కోడూరు నారాయణరావును పరామర్శిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతి జెన్నా



ఇస్తల గ్రామంలో నారాయణ రావును పరామర్శించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతీ జెన్నా

క్లుప్తంగా

భక్తి మార్గం అనుసరణీయం

- మాజీ ఎంపీ బెల్లాన


మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఘనంగా స్వాగతం పలుకుతున్న సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య, గ్రామస్తులు

వంగర: ప్రజలు భగవన్నామస్మరణతో మెలిగి భక్తిమార్గాన్ని అనుసరణీయంగా భావించాలని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వంగర మండల పరిధి గీతనాపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీరామాలయం పునఃప్రతిష్ట, శ్రీఆంజనేయస్వామి ఆలయం ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య, నెయిగాపుల ప్రసాదరావులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ నాయకులు యలకల వాసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు


సెంచూరియన్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నాగ్‌పూర్‌కు చెందిన కోడ్ ఎఫ్ సొల్యూషన్స్ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఫోరెన్సిక్ అనలిస్ట్, ఫోరెన్సిక్ ట్రైనీ, ఇన్వెస్టిగేటర్, క్రైమ్ ఆఫీసర్స్, తదితర ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శుభం రాజేంద్ర సాహు మాట్లాడుతూ బీఎస్సీ, ఎమ్మెస్సీ ఫోరెన్సిక్‌లో మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కాలంలో రూ.10వేలు స్టైపెండ్ అందిస్తామన్నారు. ఇంటర్న్‌షిప్ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. హెచ్‌ఆర్ హెడ్ శుభాంగి నీల్‌కాంత్ నిఖారే పాల్గొన్నారు.

గొర్రెపోతుల పందాలపై పోలీసుల దాడి


గొర్రెపోతులతో పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు


లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట గ్రామం సమీపంలో గల తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న గొర్రెపోతుల పందాలపై ఎస్సై నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పందెం నిర్వహిస్తున్న ఐదుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2వేలు, రెండు గొర్రెపోతులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో జేఎల్‌ఎం మృతి

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురం సమీపంలో విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన కరణం సత్యం(48) మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం పేరిపి గ్రామానికి చెందిన కరణం సత్యం ఆర్‌ఈసీఎస్‌లో చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస జూనియర్ లైన్‌మన్(జెఎల్‌ఎం)గా పనిచేస్తున్నాడు. అయితే పట్టణంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజులు నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా ఉన్నతాధికారులు జేఎల్‌ఎంలకు చీపురుపల్లిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో విధి నిర్వహణలో భాగంగానే సత్యం ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత చీపురుపల్లి నుంచి గరివిడి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న పాలవ్యాన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య సుజాత, కుమారుడు ఉన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లింగనిర్ధారణ చేసేవారిపై కఠిన చర్యలు

విజయనగరం ఫోర్ట్: లింగ నిర్ధారణ చేసేవారితో పాటు, సంబంధిత అంశంపై వాణిజ్య ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు పెట్టేవారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి హెచ్చరించారు. జిల్లా వైద్యశాఖ పరిధిలో నమోదైన ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. సీసీపీఎన్‌డీటీ యాక్టును అతిక్రమిస్తే మూడు నుంచి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు జరిమానా తప్పదన్నారు.


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బేడా

కోదండ రాముడంట కొమ్మలాల..
కౌసల్య కొమారుడంట కొమ్మలాల..
కల్యాణ రాముడిని కన్నులారా చూడాలని..కోరుకోని భక్తులుండరంటే అతిశయోక్తి కాదు. పురాణాల్లో ఆదిదంపతులుగా పూజలందుకుంటున్న సీతారాముల దర్శనానికి సంతకవిటి మండలంలోని గుళ్ల సీతారాంపురం గ్రామానికి వెళ్లాల్సిందే.

– సంతకవిటి

శ్రీరామ రామ రామేతి..!

- అజరామరం గుళ్ల సీతారాంపురంలోని ఆలయం
- 500 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారాముల ఆలయం
- ఆలయంలో అంగరంగ వైభవంగా డోలోత్సవం నిర్వహణ


గాలిగోపురం


ఏకాంత సీతారాములు


ప్రధాన ఆలయం


ధ్వజస్తంభం

రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలంలో గల గుళ్ల సీతారాపురం గ్రామంలో వెలసిన సీతారాముల ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో సీతారాములు స్వయంభూగా వెలిశారు. ఆనాడు ఈ ప్రదేశం నిర్మానుష్యంగా ఉండడంతో ఆలయం నిర్మాణంతో పాటు గ్రామం నిర్మించారు. సీతారాంపురం గ్రామాలు ఎక్కువగా ఉండడంతో గుడి సీతారాంపురంగా ఈ గ్రామాన్ని పిలిచేవారు. కాలక్రమేణా అది గుళ్ల సీతారాంపురంగా రూపాంతరం చెందింది. ఈ ఆలయానికి బొబ్బిలి రాజులు వంశపారంపర్యంగా ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. ఈ ఆలయం మొత్తం రాళ్ల పేర్పుతో నిర్మించిన అద్భుత కట్టడం. ఈ ఆలయంలో గాలిగోపురం దాదాపు 65 అడుగుల పొడవు ఉంటుంది. గాలిగోపురం పైకి ఎక్కితే బొబ్బిలిలోని వేణుగోపాలుని ఆలయం గాలిగోపురం కనిపిస్తుందని ప్రాశస్త్యం. స్వయంభూగా వెలిసిన ఇక్కడి సీతారాములు ఏకాంతవాసంలో ఉన్నట్లు ఏకశిలపై ఉండడం విశేషం. ఏ ఆలయంలో అయినా సీతారాములతో పాటు లక్ష్మణుడు, ఆంజనేయుడు ఉంటారు. కానీ ఈ ఆలయంలో లక్ష్మణుడు, ఆంజనేయుడు, శంఖుచక్రాలు, ధనుర్బాణాలు ఉండవు. ఈ ఆలయం గోడలపై చెక్కిన శిల్పాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. ప్రధాన ఆలయం చుట్టూ బేడాను ఏర్పాటు చేశారు. ఈ బేడాను అనుసరించి ఆళ్వారులు, రాధాకావతులు, రామానుజుల వారు, నమ్మాళ్వాల్, గరుడాళ్వాల్, మానవాళ్ల మహాముని, దాసాంజనేయులకు ప్రత్యేకంగా సన్నిధులను ఏర్పాటు చేశారు.

ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం జేష్ఠ శుద్ధ ఏకాదశినాడు ఉదయం రాధాకాంతుల కల్యాణం, రాత్రి సీతారాముల కల్యాణం, శ్రావణ శుద్ధ ఏకాదశినాడు పవిత్రోత్సవాలు, 30 రోజులపాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు భోగాపురపు ప్రసాదరావు తెలిపారు.

అంగరంగ వైభవంగా డోలా పౌర్ణమి

ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు(డోలా పౌర్ణమి) స్వామి వారిని ఆంజనేయ వాహనం, సర్ప వాహనంపై ఊరేగింపుగా ఉత్తర ముఖ మంటపానికి వేంచేసి భక్తకోటి అందరికి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఇక్కడ స్వామి వారికి ఊంజల్ సేవ చేస్తారు. దీనినే డోలోత్సవం అంటారు. ఆ రోజు నుంచి మూడు రోజుల పాటు డోలాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా ఏటాలాగానే ఈ నెల 14 నుంచి 16 వరకు డోలాయాత్ర నిర్వహించనున్నారు.

ఆలయాని చేరుకోవడమిలా..

రాజాం పట్టణానికి 8 కిలోమీటర్ల దూరం..సంతకవిటి మండకేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. రాజాం నుంచి బస్సు సౌకర్యం ఉంది. రాజాం నుంచి మందరాడ, సంతకవిటి, మండాకురిటి బస్సు ద్వారా ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఆటోలు కూడా అందుబాటులో ఉంటాయి.

సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- అంబేడ్కర్ ఇండియా మిషన్, దళిత సంఘాల నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న అంబేడ్కర్ ఇండియా మిషన్, దళిత సంఘాల నేతలు భాను మూర్తి, రేగాన శ్రీనివాసరావు తదితరులు

విజయనగరం టౌన్: దళిత అధికారులపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష పూరిత చర్యలు చేపట్టడం దారుణమని, కూటమి ప్రభుత్వం పలువురు దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగులివ్వకుండా ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తోందని, డీజీ ర్యాంకులో ఉన్న పీవీ.సునీల్ కుమార్‌పై ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చేపట్టడం విచారకరమని అంబేడ్కర్ ఇండియా మిషన్ ప్రతినిధులు బొంగ భానుమూర్తి, రేగాన శ్రీనివాసరావు, కె.భీమారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక బాలాజీ కూడలి వద్దనున్న అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జూన్ 12 తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి నేటివరకూ సుమారు తొమ్మిదినెలల కాలంలో రాష్ట్రంలో ఉన్న దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను టార్గెట్ చేస్తూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెడుతూ, నారా లోకేష్ తీసుకువచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అములుచేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని మోడీ అమలు చేస్తే, రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సోము మురళీమోహన్, పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ధన్యవాదాలు

నెల్లిమర్ల: కార్మికుల శాంతియుత పోరాటంతో జూట్‌మిల్లు తిరిగిందని జూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మిల్లు తిప్పడానికి యాజమాన్యం నోటీసు జారీచేసి నిర్వహణ పనులు ప్రారంభించిన నేపథ్యంలో ఆయన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల శాంతియుత పోరాటం ఫలితంగా మిల్లు తిరుగుతుందన్నారు. అలాగే గడిచిన 9నెలలుగా యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినా కార్మికుల శాంతియుత పోరాటంతో దఫా దఫాలుగా చర్చలు జరిపి ముందుగా బోనస్ సాధించి మిల్లు తిరగడానికి పార్టీల కతీతంగా కార్మికులు ఎంతో సహకరించారంటూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కార్మికులు ఇదే స్ఫూర్తిని కొనసాగించి సమస్యలు ఎదురైతే భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

5 చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- రూ.ఆరు లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పీఎస్ పరిధి జమ్ములో గత నెల 22న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో జరిగిన దొంగతనం కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు సదరు నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్టు చేసి నిందితుడి దగ్గర నుంచి సుమారు రూ.ఆరు లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ, సీఐ లక్ష్మణరావు, ఎస్సై అశోక్‌లు ఈ విషయంపై మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు చెందిన చల్లా ప్రతాప్‌రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో 5 దొంగతనాలకు పాల్పడ్డాడని చెప్పారు. గత నెల ఫిబ్రవరిలో జమ్ములో రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయి ఇనుగంటి సూర్యనారాయణ తన ఇంటికి తాళం వేసి పెళ్లి నిమిత్తం యలమంచిలి వెళ్లారు. అదే రోజున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో బంగారు అభరణాలను ఎత్తుకెళ్లారని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయి ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్సై అశోక్ సీఐ లక్ష్మణరావు సూచనలతో నిఘా పెట్టగా సోమవారం నగరంలోని విజ్ఞాన భారతి స్కూల్ వద్ద బాబామెట్ట ద్వారకనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రతాప్‌రెడ్డిని పట్టుకుని విచారణచేయగా దొంగతనం విషయం బయటపడింది. నిందితుడి దగ్గర ఒక బంగారు నెక్లెస్, ఒక హారం, నాలుగున్నర జతల చెవి దిద్దులు, జత గొలుసు, ఒక గోల్డ్ చైన్‌తో కలిసి మొత్తం రూ.6లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు.

శబ్ద కాలుష్యం నివారించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: శబ్ద కాలుష్యం నివారించాలని అందుకుగాను డీజేలు వంటి పోగ్రాంలు నిరోధించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకూడదని తెలిపారు. అవసరం మేరకు మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలని సూచించారు. మానవుడికి వినికిడి చాలా ప్రధానమైనదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి, ఎస్‌సీడీపీఓ డాక్టర్ వీవీబీ సుబ్రహ్మణ్యం, డీపీఎంఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఎంఓ మణి, డాక్టర్ వెంకటేష్, డెమో వి.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

సంగాం ఆలయంలో భక్తుల రద్దీ

- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు


సంగమేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు


త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వంగర: మండల పరిధి సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో ఉన్న సువర్ణముఖి, వేగావతి, నాగావళి నదులు కలిసే కూడలి(త్రివేణి) సంగమం వద్ద పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. పితృదేవతలకు అధిక సంఖ్యలో భక్తులు పిండప్రదానాలు చేశారు.

క్రీడల్లో మిమ్స్ వైద్య విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న మిమ్స్ చైర్మన్, ప్రతినిధులు

నెల్లిమర్ల: ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన క్రీడాపోటీల్లో నెల్లిమర్లలోని మిమ్స్ హోమియో కళాశాల వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం మిమ్స్ పీఈటీ కె.వెంకటరావు మాట్లాడుతూ ప్రతిపాడు హెల్త్ యూనివర్సిటీ ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో మిమ్స్ హోమియో వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ సాధించారని తెలిపారు. అలాగే పోటీల్లో పురుషులు, మహిళా జట్లు విజేతలుగా నిలిచాయని చెప్పారు. పురుషుల జట్టు క్రికెట్, టేబుల్‌టెన్నిస్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించగా, మహిళా క్రీడాకారులు వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, పరుగుపందెంలో బంగారు పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా మిమ్స్ చైర్మన్,మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, హోమియోపతి వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఏఓ పి.గణేష్ పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

- ఈ నెల 10వ తేదీలోపు గడువు
- డీఈఓ యు.మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయ/ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఈఓ యు.మాణిక్యంనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) రూపొందించిన ఈ జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా ఈనెల 10వ తేదీ లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అభ్యంతరం చేసే ఉపాధ్యాయుని పూర్తి పేరు, పనిచేస్తున్న కేడర్, అభ్యంతరం చెబుతున్న వివరాలు వివరించాలి. సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలి. ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు విధిగా జతచేయాలి. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

- కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: వ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యాధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, అతిసార వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు విజృంభించకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. నివేదికలు యాప్‌లో అప్లోడ్ చేసేటప్పుడు ఒకటి, రెండుసార్లు సరి చూసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఫీడ్ బ్యాక్ సర్వేలో జిల్లా ర్యాంకు మెరుగుపడాలని, దీని కోసం వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లిప్తతను విడనాడి తమ సేవలను మరింత మెరుగ్గా అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.వి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

మార్చి 8వ తేదీన నిర్వహించే మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాజీవ్ స్టేడియంలో నిర్వహించే మహిళా దినోత్సవానికి సుమారు 4 వేల మంది మహిళలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు వెయ్యి మందికి ఎన్‌పీటీఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. డీఆర్‌డీఏ నుంచి రూ.121 కోట్లు, మెప్మా నుంచి రూ.20కోట్లు విలువైన బ్యాంకు లింకేజీని అందజేయాలన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న నలుగురు మహిళలను సన్మానించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ జి.ప్రసన్న, డీఎంహెచ్‌ఓ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెండోరోజు జాతర

- కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి
- దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజలు


శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు


అమ్మవారి దేవస్థానం మంటపంలో సామూహిక కుంకుమ పూజలు


రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు


డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చిట్టి మాస్టర్

చీపురుపల్లి: భక్తుల కొంగు బంగారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం జాతర ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దివ్యంగా అలంకరించిన అనంతరం ప్రధాన అర్చకుడు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అర్చకులు హారతి ఇచ్చారు. అమ్మవారి దేవస్థానానికి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు, ధ్వజస్తంభాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. అలాగే దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి దేవస్థానం మంటపంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

అలరించిన డ్యాన్స్ పోటీలు..

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు అలరించాయి. సోమవారం రాత్రి 7 గంటల నుంచి డ్యాన్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా డ్యాన్స్ మాస్టర్ చిట్టి వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో విశాఖపట్నం బృందం నిలవగా రూ.60 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన హైదరాబాద్ బృందానికి రూ.40 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బొబ్బిలి బృందానికి రూ.30 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన విజయనగరం బృందానికి రూ.20 వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు.